రోడ్డెక్కిన పూర్ణామార్కెట్!

- రహదారి మధ్యలోనే వ్యాపారుల విక్రయాలు
- రాకపోకలకు వినియోగదారుల ఇక్కట్లు

జగదాంబ: పూర్ణామార్కెట్ రోడ్డెక్కింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు లోపల ఉండే దుకాణాలన్నీ సాయంత్రం అయ్యే సరికి ప్రధాన రోడ్డుపైకి తీసుకురావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో లోపల వ్యాపారులు, బయట వినియోగదారులు, వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డంతా ఇదే విధంగా దుకాణాలు వెలియడంతో వాహనచోదకులు రహదారి మధ్యలో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆదేశాలు బేఖాతర్

రోడ్డుపై దుకాణాలు పెట్టుకోవడం వల్ల లోపల వ్యాపారులకు బేరాలు ఉండడం లేదు. ఈ విషయంపై గతంలో మూడు రోజుల పాటు మార్కెట్‌ను బంద్ చేసి వర్తక సంఘం సభ్యులు ఆందోళన కూడా చేశారు. మేయర్ హరివెంకటకుమారి కూడా స్వయంగా పూర్ణామార్కెట్‌ను సందర్శించి దుకాణలన్నీ రోడ్డుపై నుంచి తొలగించి మార్కెట్ లోపలే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాలు కూడా అమలు కావడం లేదు.

60 అడుగుల రోడ్డు 10 అడుగులకు..

పూర్ణామార్కెట్ వద్ద 60 అడుగులకు పైగా బీటీ రహదారి ఉంది. కానీ ఆక్రమణల కారణంగా రోడ్డు కుదించుకుపోయి 10 అడుగులు మాత్రమే మిగులుతుంది. చిరు వ్యాపారులు రోడ్డును పూర్తిగా ఆక్రమించేస్తున్నారు. పాదచారుల రాకపోకలతో పాటు కనీసం వాహనాల పార్కింగ్ కూడా అవకాశం ఉండడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై వ్యాపారాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో కూరగాయల విక్రయాలు

క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తోట వాసుదేవరావు

డాబాగార్డెన్స్: సర్దార్ గౌతు లచ్చన్న రాజకీయ జీవితం విశాఖ నుంచే ప్రారంభమైందని కాంగ్రెస్ బీసీ సెల్ వైస్ చైర్మన్, విశాఖ జిల్లా శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు తెలిపారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా బుధవారం జడ్జి కోర్టు సమీపాన ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ తొలిసారిగా షిప్‌యార్డ్ యూనియన్ నాయకుడిగా లచ్చన్న గెలుపొందారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే, ఎంపీగా గెలుపొందారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లి గోపాలం, బంటుపల్లి జోగారావు, బగాది వెంకటి, పూతి చంద్రబూసన్, పితాని ప్రసాద్, బొంగు సత్తిరాజు, జలుమూరు చిట్టిబాబు, బొంగు రాజారాజు, శ్రీశయన కులస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



టీకాలు వేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వేంకటేశ్వర మెట్ట శ్రీవేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో బుధవారం చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అవగాహన, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చేపట్టారు. కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ క్లినిక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి పాల్గొని చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయానికి వేయాల్సిన వ్యాక్సిన్ల గురించి ఆశ వర్కర్లు బి.లీలావతి, జ్యోతి వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకల సదుపాయాలు ఉన్నాయని, ప్రసవం అక్కడే చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ప్రతినిధులు భీశెట్టి శ్రీను, శరగడం మోహనరావు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫాను అందజేస్తున్న శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులో ముస్లింలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ సొంత నిధులతో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం దరి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖర్జూరం, బాస్మతి రైస్, నెయ్యి ప్యాకెట్, పంచదార, సేమియాతో కూడిన కిట్‌ను సుమారు 150 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో మసీదు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ముస్లింలు షేక్ రసూల్ జిలానీ, షేక్ రహమత్, షేక్ ఖాదర్ వలీ, షేక్ మదీనా వలీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రభాత్ కల్యాణ్, ఆనంద్, దేవి పాల్గొన్నారు.

ఇంటింటా అపూర్వ ఆదరణ

- జోరుగా 'మా నమ్మకం నువ్వే జగన్'



బంగారుమెట్టపై లబ్ధిదారుకు బ్రోచర్ అందిస్తున్న బొర్రా శ్రీనివాసరెడ్డి



వెంకటేశ్వరమెట్టపై ప్రజలకు స్టిక్కర్ అందిస్తున్న బొడ్డేటి ప్రసాద్



27వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న సర్వేశ్వరరెడ్డి

అల్లిపురం: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ఇంటింటా అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రతీ ఇంటికి వెళ్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ప్రజలు సాదరంగా స్వాగతిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు తమకు భరోసా ఇస్తున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.

- 33వ వార్డులో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్ట–1 పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గృహసారథులు సూరిశెట్టి శ్రీను, కోరిబిల్లి శ్రీను, వలంటీర్ యామిని తదితరులు పాల్గొన్నారు.
- బొర్రా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్ట–2 సచివాలయ పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగారుమెట్ట, సీబీఎం యూపీ స్కూల్ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను కొనసాగించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్ రజనీ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో బంగారుమెట్ట సచివాలయ పరిధిలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠం, కన్వీనర్లు కణితి బ్రహ్మం, కొల్లి సత్యవతి, పిల్లి శివ, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

27 వార్డులో..

సీతమ్మధార: 27వ వార్డు దొండపర్తి, బాగీవారి వీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 28, 29, 30, 37 వార్డుల క్లస్టర్–4 ఇన్‌చార్జ్ పీతల వాసు నేతృత్వంలో అంగటిదిబ్బ, పందిమెట్ట, వెంకటపతిరాజునగర్, రామజోగిపేట, ప్రకాశరావుపేట సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ ఉన్న స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నీలాపు లక్ష్మి, కోరాడ సురేష్, బెవర మహేష్, రాపాక శ్రీను, అడపా శివ, గండి అప్పలరాజు, గండి పద్మ, ఆరుగుల రాజ్‌కుమార్, వద్దాది దిలీప్, వెంకట్, కల్యాణి, సారిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు. 37వ వార్డు ఇన్‌చార్జ్ ఆకుల ఏసు నేతృత్వంలో పలు సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.



37వ వార్డులో పథకాలపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ ఆకుల ఏసు



ప్రకాశరావుపేటలో స్టిక్కర్ అతికిస్తున్న పీతల వాసు

ఐహెచ్ఆర్‌సీ విశాఖ జిల్లా మీడియా కార్యదర్శిగా రాజశేఖర్

డాబాగార్డెన్స్: ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ సంస్థకి విశాఖ జిల్లా మీడియా కార్యదర్శిగా ఎంవీ రాజశేఖర్‌ని నియమించారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులకు పరిచయం చేశారు. అనంతరం ఏయూ ఉప రిజిస్ట్రార్ డాక్టర్ పీవీఎస్ఎన్‌వీ సాంబమూర్తి చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ పదవిలో వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు కొనసాగుతారు. మానవ హక్కుల పరిరక్షణకు సంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాలతో పాటు మీడియా విభాగానికి రాజశేఖర్ ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఐహెచ్ఆర్‌సీ జాతీయ చైర్మన్ ఆర్.ప్రసాదరావు, యూత్ అధ్యక్షుడు సుగుణకుమార్, వివిధ శాఖల సభ్యులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న రాజశేఖర్

ఆశీలు పాట వాయిదా



వేలంపాట నిర్వహిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలోని పూర్ణామార్కెట్, రామకృష్ణ రైతుబజార్, రెల్లివీధి మార్కెట్లకు సంబంధించిన వేలంపాటను వాయిదా వేసినట్లు జెడ్సీ కె.శివప్రసాద్ తెలిపారు. జోనల్ కార్యాలయం నాలుగో అంతస్తులో బుధవారం నిర్వహించిన వేలంపాటపై కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడం వలన రద్దు చేస్తున్నట్టు తెలిపారు. గతంలోనూ ఇదే విధంగా మూడుసార్లు రద్దు చేశామన్నారు. మళ్లీ ఈ నెల 20, 21 తేదీల్లో వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు జోనల్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి కన్నుమూత



కృష్ణమూర్తి(ఫైల్)

ఆరిలోవ: సుదీర్ఘకాలం పాటు సీపీఎంలో సేవలు అందించిన వి.కృష్ణమూర్తి(67) బుధవారం వేకువజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆరిలోవలోని ఆయన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించే సమయానికే ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆరిలోవ తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని కృష్ణమూర్తి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.మణి, నరేంద్రకుమార్, శంకరరావు, సూర్యమణి, రంగమ్మ, సీపీఐ జిల్లా నాయకుడు రెహమాన్ తదితరులు అంజలి ఘటించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో నాయకులు మాట్లాడుతూ కృష్ణమూర్తి చేసిన పోరాటాలు, అందించిన సేవలను కొనియాడారు. పోరాట పటిమ ఉన్న మంచి వ్యక్తిని సీపీఎం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ సంస్మరణ సభలో కన్నీరుపెట్టుకున్నారు. కృష్ణమూర్తికి భార్య అన్నపూర్ణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఏఎంసీకి అప్పగించడానికి కృష్ణమూర్తి పార్థివ దేహాన్ని తీసుకెళుతున్న సీపీఎం నాయకులు

ఏఎంసీకి పార్థివదేహం అప్పగింత

కృష్ణమూర్తి ఆలోచనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం అప్పగించడానికి అంగీకరించారు. ఇందులో భాగంగా అతని నేత్రాలు ఎల్వీపీ కంటి ఆస్పత్రికి దానం చేశారు. అనంతరం పార్థివ దేహానికి అంతిమ యాత్ర నిర్వహించి, కుటుంబ సభ్యులు, సీపీఎం, సీపీఐ నాయకులు ర్యాలీగా తీసుకెళ్లి ఏఎంసీకి అప్పగించారు.

'ఉదయం 6 గంటలకే వార్డుల్లో క్లాప్ వాహనాలు ఉండాలి'



డంపింగ్ యార్డులో రికార్డులు పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్

జగదాంబ: ప్రతీ రోజు ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు వార్డుల్లో ఉండాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ ఆదేశించారు. కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు 35వ వార్డులోని డంపింగ్ యార్డును బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ యార్డులో షిల్ట్ మట్టి తరలించాలని కమిషనర్ ఆదేశించారని తెలిపారు. చెత్త సేకరించే క్లాప్ వాహనాలు, జీవీఎంసీ వాహనాలు యార్డులో 6గంటల తరువాత కనబడకూడదన్నారు. వార్డులో ఇంటింటికి వెళ్లలేని దారుల్లో, వార్డులో అనుకూలంగా ఉన్న ప్రదేశాల్లో వాహనాలు పార్క్ చేసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని ఆదేశించారు. రికార్డుల్లో అవకతవకలపై ఏఎంహెచ్‌వో అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు ప్రధాన కమిషనర్ దృష్టిలో పెడతామని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులు ప్రజలతో మమేకం కావాలి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్సీ

జగదాంబ: సచివాలయ కార్యదర్శులు ప్రజలతో మమేకం కావాలని జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. 31వ వార్డులోని సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల జాబితాను ప్రజలకు తెలిసేలా బోర్డుల్లో పెట్టాలని, దీనివల్ల లబ్ధిదారులకు ఏ నెలలో ఏ పథకం మంజూరవుతుందో సులభంగా చూసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యాలయాల్లో దరఖాస్తులు పెండింగ్ ఉండకూడదన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు.

ప్రకాశరావుపేట పాఠశాల విద్యార్థులకు బహుమతులు

- ఈఎండీపీ రాష్ట్రస్థాయి ఎక్స్‌పోకు ప్రాజెక్ట్ ఎంపిక
- నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపిక బహూకరణ

డాబాగార్డెన్స్: ఇటీవల విజయవాడలో నిర్వహించిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ) రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు ఎక్స్‌పోలో పాల్గొన్న జీవీఎంసీ ప్రకాశరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. పిల్లల్లో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ఈఎండీపీ జిల్లా మేనేజర్ కె. నరేష్ బుధవారం పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ఈఎండీపీకి కూడా ఎంపిక కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో పాల్గొన్న సీహెచ్ రాహుల్, సీహెచ్ దీప్తిశ్రీ, కె.సుమంత్, పి. ప్రవల్లిక, కె. వెంకట శ్రీహర్షకు జ్ఞాపికలను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పాఠశాల సిబ్బందిని, 9వ తరగతి విద్యార్థుల మెంటార్ శ్యామలను ఆయన అభినందించారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన మరో విద్యార్థిని ఎంపిక చేసి రూ.2వేల నగదు ప్రోత్సాహకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ ముఖ్యోద్దేశాన్ని,, వివరాలను చర్చించారు.



ప్రోత్సాహక బహుమతులతో విద్యార్థులు

నీటి నిల్వలపై మూతలు తప్పనిసరి

అల్లిపురం: ఇళ్లలో నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, బిందెలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని మలేరియా సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు సూచించారు. భీమ్‌నగర్ మలేరియా సిబ్బంది మురళి, అప్పారావు, కొబ్బరితోట అర్బన్ హెల్త్ క్లినిక్ ఆశ వర్కరు బుద్దా లీలావతి బుధవారం వేంకటేశ్వరమెట్ట, శ్రీవారి పాదాల వద్ద డెంగూ కేసు నమోదు కావడంతో ఆ ప్రాంతంలో ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



వాటర్ ట్యాంకులు పరిశీలిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది, ఆశ వర్కర్

వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజు మృతి



వద్దాది రాజు(ఫైల్)

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు వద్దాది రాజు(49) మంగళవారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుండెపోటుతో మరణించారు. రాజుకు భార్య పద్మావతి, కుమార్తెలు మేఘనా రాజు, ఊర్మిళ పద్మరాజు ఉన్నారు. ద్రోణంరాజు శ్రీనివాస్‌కు ముఖ్య అనుచరుడిగా ఉన్న రాజు ఆయన వెంటే వైఎస్సార్‌సీపీలో చేరారు. అప్పటి నుంచి పార్టీకి సేవలందిస్తూ వచ్చారు. వద్దాది భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. వద్దాది కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. బుధవారం సాయంత్రం కాన్వెంట్ జంక్షన్ సమీపంలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు.



రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

వైఎస్సార్ సీపీ నాయకుడు వద్దాది రాజు దహన ఖర్చులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.

వారణాసికి ప్రత్యేక రైలు సంతోషదాయకం

- ఎంపీ జీవీఎల్ నరసింహారావు
- రైల్వేస్టేషన్‌లో బీజేపీ శ్రేణుల సందడి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో బనారస్(వారణాసి) రైలు ప్రారంభం సందర్భంగా బుధవారం బీజేపీ శ్రేణులు సందడి చేశారు. రైలు బయలుదేరడానికి ముందుగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, పార్టీ శ్రేణులతో కలిసి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారంతో గంగా పుష్కరాల సందర్భంగా విశాఖ నుంచి వారణాసికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత పుష్కరాలకు నాటి ప్రభుత్వాలు సరిగ్గా చర్యలు చేపట్టలేదని, వీటిని ముందుగానే గుర్తించిన యూపీ సర్కార్, మోదీ ప్రభుత్వం పుష్కరాలకు వచ్చే యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ పుష్కరాలకు ఎక్కువగా తెలుగు రాష్ట్రాల ప్రజలు హాజరవుతారని, వీరికి ఏ ఇబ్బంది లేకుండా వసతి, సదుపాయాలు, సమీప ఆలయాల గురించిన వివరాలతో కరపత్రిక తయారుచేసి, ఆవిష్కరించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ రైలును రెగ్యులర్‌గా నడపాలని ప్రతిపాదనలు పంపామని జీవీఎల్ చెప్పారు. బుధవారం వారణాసికి బయలుదేరిన రైలులో ప్రయాణికులు, సిబ్బందితో ఆయన మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.



రైలు వద్ద బీజేపీ శ్రేణులతో కలిసి జీవీఎల్ సందడి

మహిళలకు చీరల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారిలో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో పేద మహిళలకు బుధవారం చీరలు, పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జ్ఞానాపురం రక్షణగిరి రహదారిలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐతి రవిబాబు, గండి వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- రూ.లక్ష అపరాధ రుసుము విధింపు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లోని హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ ఆకస్మిక దాడులు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న దుకాణాలకు రూ. లక్ష మూడు వేల అపరాధ రుసుము విధించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారం చేసినా పట్టించుకోకుండా హోల్‌సేల్ దుకాణాల్లో వ్యాపారులు యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నారన్నారు. దీంతో మళ్లీ ప్లాస్టిక్ వినియోగం ఎక్కువైందన్నారు. పాలిథిన్ దుష్ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం వచ్చినా, వ్యాపారుల్లో రాలేదన్నారు. ఇందుకోసమే మళ్లీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దాడులు నిర్వహించేందుకు కమిషనర్ సాయికాంత్ వర్మ చర్యలు తీసుకున్నారన్నారు. కవర్లు విక్రయిస్తే ఆయా దుకాణాలకు అపరాధ రుసుం విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. భూమిలో కలిసిపోయే 125 మైక్రాన్ కవర్లు మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విధి విధానాల ప్రకారం (నాన్ ఓవెన్ కవర్లు) పీచు ఎక్కువగా ఉన్న సంచులు కూడా నిషేధించినట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



పూర్ణామార్కెట్ వద్ద దుకాణంలో ప్లాస్టిక్ కవర్లు పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్